

# మన్నించు సోదరా!

— ఎ. శ్రీహరి

అతను...!!

అవునూ!... అతను!!...

అస్పష్టంగా అతనిరూపం... నీటిబుడగలా... లీలగా వస్తూపోతూ...

దీనంగా జాలిగొలిపే అతని చూపులు... జీవితంతో పోరాడీ అలసి ఓడి, వాడిన అతని ముఖం... అస్పష్టంగా నాకళ్లలో కదలాడుతూ... గత జ్ఞాపకాలను నాలో మేల్కొలుపుతూ...

అతనింకా అక్కడే ఉన్నాడేమో! ఉండినా ఉండొచ్చు...! ఇంకో పదేళ్లకొచ్చినా అక్కడే అట్లాగే ఉంటాడేమో!

ఎన్ని రోజులైంది అతన్ని చూసి!... ఐదేళ్ళా!!

ఈ ఐదేళ్ల నా జీవితంలో ఎన్ని మార్పులు... ఉద్యోగం, పెళ్లి, పిల్లలు-ఉద్యోగంలో ఓ ప్రమోషన్ కూడా... బహుశా జీవితంలోని అన్ని రుచులనూ అనుభవించానేమో!

ఎంత మార్పొచ్చినా... నన్ను నేను మర్చిపోయినాసరే... అతన్ని మాత్రం తప్పకుండా గుర్తుపడతాను... అయినా అతనిలో మార్పు వస్తుందంటే నా అంతరాత్మ ఒప్పుకోవడంలేదు.

అతను నాకేమైనా పరిచయస్తుడా అంటే పరిచయస్తుడే - అతన్ని నేను బాగా ఎరుగుదును. కానీ అతను నన్ను ఎరిగి ఉండకపోవచ్చు.

అదేమి?! అంటే అది అంతే! కొన్ని పరిచయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ప్రభావం మాత్రం చాలా ఘాటుగా ఉంటుంది.

మా పరిచయమూ అంతే!

ఐదేళ్ల క్రితం నేను చిరుద్యోగం కూడాలేని నిరుద్యోగిని. డిగ్రీ పట్టుకుని ఉద్యోగాన్వేషణలో ఎంప్లాయిమెంట్ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రోజుల్లో నాలానే అతనూ దేవుడి దర్శనంకోసం పడిగాపులు పడుతున్న భక్తుడే.

నే వెళ్లిన ప్రతీసారి కనిపించేవాడు.

ఏ అరుగు మీదనో... చెట్టుకిందనో కూర్చొని విచారమైన ముఖంతో దీనంగా శూన్యంలోకి, కనిపించని వస్తువునేదో వెతుకుతున్నట్టుగా చూస్తుంటాడు. తనలో తను ఏదేదో గొణుగుకుంటూ ఉంటాడు.

చూసిన మొదటిసారి అతనో పిచ్చివాడు కాబోలనుకున్నాను. కానీ అతను పిచ్చివాడు కాదని, పరిస్థితులు - కేవలం ఉద్యోగావసరమే అతన్నలా మార్చిందని తర్వాత తెలుసుకున్నా. జాలి కలిగింది. ఇదీ అని చెప్పలేని ఆర్ద్రతతో కూడిన భావం ఏర్పడింది అతని పైన.

వెళ్లిన ప్రతిసారి అతనికోసం నా కళ్లు ఆత్రంగా వెతికేవి... అతనిలో మార్పేమైనా కనిపిస్తుందేమోనని గుచ్చిగుచ్చి చూసేవి. కానీ ఫలితం మాత్రం శూన్యం - అవే చూపులూ. అదే స్థితి... .నాకు చాలా బాధేసేది.

కనీసం రెండుపూటలా తిండికి కూడా దారిచూపని ఈ వ్యవస్థ అంటే రోత పుట్టింది. అతనికి ఏమైనా సాయంచేసి ఆదుకోవాలనే ఆరాటం - ఏమీ చేయలేని నిస్సహాయత నలిగిపోయాను.

హఠాత్తుగా ఓ రోజు నోటీసు బోర్డుపై నా పేరు ప్రత్యక్షమైంది... నమ్మలేకపోయాను. మళ్లీ చూశాను... నిజమై నా పేరే!... పిచ్చి ఆనందంతో ఎగిరి గంతేయాలనిపించింది. ఎందుకంటే నా డిగ్రీ పూర్తయి నిండా సంవత్సరం కూడా పూర్తికాలేదు. అంతలోనే ఇలా అదృష్టం నా తలుపుతట్టింది.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయాను. నా అంత అదృష్టవంతుడే లేడని మురిసిపోతున్న నాకు, అలాంటి అవకాశాలకోసమే ఎదురుచూస్తున్న అతను గుర్తొచ్చి ఆతృతగా అటువైపు చూశాను.

- ఏ భావమూ లేక నిర్వేదంగా... అదే స్థితిలో అతను...

ఆనందమంతా తుస్సున గాలిలో కలిసిపోయింది. దాని స్థానంలో అర్థంకాని అమోమయ భావమేదో చోటు చేసుకుంది. నాలో-

అర్థంకాక మళ్లీ బోర్డువైపు చూశాను.

''షెడ్యూలు కులాల కొరకు ప్రత్యేక నియామకం'' మిలమిల మెరుస్తున్నాయ్ అక్షరాలు - ఇంగ్లీషులో

ఎదుటి వానికి అన్యాయం జరుగుతుంది కదా అని నాకు దరిచేరిన అవకాశాన్ని ఒద్దనుకునే పాటి విశాల హృదయానికి నేను నోచుకోలేదు. కానీ నాలోని రెండు మనసు మాత్రం అప్పుడప్పుడూ ఎదురు తిరుగుతుంది - గెలవలేక మామూలయి పోతుంది - ఇప్పట్లాగే.

ఏదో తప్పు చేశానన్న భావం నా హృదయంలో ప్రవేశించి నన్ను చెదపురుగులా తినేస్తుంది. ధైర్యంగా అతని ముఖాన్ని చూడలేక తలక్రిందికి దించుకుని చరచరా బయటికొచ్చేశాను.

అప్పుడు రావడమే రావడం, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత, తప్పని పరిస్థితుల్లో తమ్ముని ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా రావాల్సి వస్తుంది.

'శ్రీనగర్ కాలనీ!' కండక్టర్ అరుపుతో మేము బస్సులో ఉన్నామన్న సంగతీ, దిగవలసిందీ అక్కడే అన్న విషయమూ గుర్తొచ్చి గబగబా దిగాము.

ఆఫీసుకు దగ్గరవుతున్న కొద్దీ నా గుండెలో దడ అధికమవసాగింది.

నేను గేట్లో ప్రవేశించక మునుపే నా కళ్లు భయంభయంగా చెట్టుకిందికి చూసాయి. చిత్రం! అతను అక్కడలేడు. అరుగు మీదా - చుట్టూరా - కూర్చోడానికి అనువైన ప్రతి ప్రదేశాన్ని వెతికాయి. ఆశ్చర్యం !!... అతనెక్కడా కనిపించలేదు.

ఇది కలా!! నిజమా !!!... అతను ఇక్కడికి వచ్చే అవసరం తీరిపోయిందా!?... నాలానే అతనికీ ఏదో ఉద్యోగం దొరికిందా!! నిజమేనా!! నా మనసెందుకో ఆనందంతో ఉరకలేస్తుంది. అనుమానంతో కొట్టుకుంటుంది.

నోటీస్‌బోర్డు దగ్గర ఏదో తెలుసుకోవాలనే కుతూహలంతో... ఆ జనాల మధ్యకుంటుతూ... అతనే నా ప్రశ్నకు సమాధానమయ్యాడు.

అతని కాలు... కాలుకేమయింది?!

''ఆత్మహత్యా ప్రయత్నం! నిరుద్యోగం భరించలేక'' అక్కడి అటెండరును కదిలిస్తే వచ్చిన సమాధానమది.

నా శరీరం వణికిపోతుంది... కళ్ళు తిరుగుతున్నాయి. పడిపోతానేమో !... తమ్ముడి ఆసరాతో అరుగుపై కూర్చున్నా!

అతని రెండువైపులా ఉన్న రెండు కర్రలు నన్ను అసహ్యించుకుంటున్న భావన. అతని ప్రతి అడుగూ ఒక్కొక్క సమ్మెట పోటులా నా గుండెను తాకుతుంది.

'దోషిని నేనేనా ?!... నేనేనా?!' ఈ ప్రశ్నను నాకు నేనుగా ఎన్నిసార్లు వేసుకున్నానో!కాని సమాధానం మాత్రం శూన్యం.

ఎవరినడగే అవకాశం నాకివ్వకుండా అతను... తన అవిటితనానికి ఆసరాగా ఇరువైపులా రెండు కర్రలతో దూరంగా ...

ఊహించని విధంగా అతనిపేరు ఆ లిస్టులో వుంది. అది చూడంగానే నిజం చెప్పాలంటే నా పేరు చూసుకున్నప్పటికంటే - ఉద్యోగం వచ్చినప్పటికంటే ఎక్కువగా సంతోషపడ్డాను.

జీవితంలో మొదటిసారేమో! అతని ఆనందానికి హద్దులు కరువైనాయి. అతని సంతోషం ఎలా - ఎవరిదగ్గర వ్యక్తపరచుకోవాలో తెలియక తికమకపడుతూ నావైపు తిరిగి నన్నే ఊపేస్తూ-

ఇన్నిరోజులూ, అతని ముఖంలో అలాంటి కళను చూడగలనా అని అనుకునే వాడిని. అతని ముఖం అలాగే కళగా వెలగాలంటే - 'ఓ భగవాన్! ఆ ఉద్యోగం అతనికి తప్పకుండా వచ్చేటట్టుగా చెయ్యిస్వామీ! - మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థించుకున్నాను.

అవిటి తనాన్ని కూడా లెక్క చేయకుండా గబగబా గేటు దాటుతున్న 'అతను' నాలోని న్యూనతా భావాన్ని కొద్దికొద్దిగా తీసుకుపోతున్నాడు.

★★★★★★

''కాలమంత విలువైంది లేదు. అంత విచ్చలవిడిగా ఖర్చు చేయబడేదీ లేదు'' అని ఎవరో ప్రముఖుడు అన్నట్టు ఎంతో విలువైన కాలాన్ని విచ్చలవిడిగా గడిపేసి తర్వాత బాధ పడతాం - ఏం లాభం. కాలంతోపాటు మనం పరుగెత్తుతూ దానిని సద్వినియోగం చేసుకుంటేనే కదా కాలం విలువ తెలిసేది.

కాని అది తెలుసుకునేలోపే చాలా జీవితం వృధాగా ఖర్చయిపోతుంది.

నాదీ అలాంటి పరిస్థితే... కాలం ఇంత విలువైంది అని నాకు నేనుగా తెలుసుకునే లోపే నేను రిటైరయిపోయా!

నాకు ఇద్దరు కొడుకులు, ఒక్క కూతురు - పెద్దోడు ఎమ్మార్వోగా రాజపేటలో ఉద్యోగం, రెండోవాడు బేంక్ మేనేజర్ - నివాసం హైదరాబాద్‌లోనే ప్రస్తుతం నేవుంటుంది కూడా ఇక్కడే.

ఇక అమ్మాయి విషయానికొస్తే - లెక్చరర్‌గా కాకినాడలో ఉద్యోగం - అల్లుడు కూడా అదే కాలేజీలలో లెక్చరర్.

ముగ్గురికీ మంచి జీవితాలనే ఇవ్వగలిగాను, అయినా ఏదో అసంతృప్తి ఇంకా ఏదో సాధించాల్సింది ఉందని - అయినా ఆశకు అంతెక్కడని??

రిటైర్ కాకమునుపు రిటైరయితే బాగుండు. హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చునుకున్నాను. తీరా రిటైరయ్యాక తెలుస్తుంది ఖాళీగా ఉండటం ఎంత నరకమో!

ఈ మధ్యన సాయంత్రాలు అలా పేరేడ్ గ్రౌండ్ దాకా వాకింగ్‌కు వెళ్లొస్తున్నా అదో వ్యాపకంగా ఉంటుందని - తోడుగా నా రెండేళ్ల మనవడు కూడాను.

సాయంత్రమైందంటే చాలు మా మనవడు ఒకటే గొడవ - వాడికదో సరదా, రోడ్డుపై నడవడమంటే.

'హలో హరినాథ్‌గారూ! బావున్నారా?!' అన్న పలకరింత వినిపించి వెనక్కు తిరిగాను.

ఆ పలకరించిన వ్యక్తిని ఎక్కడో చూసానుగాని ఎక్కడనేది మాత్రం ఎంత ఆలోచించినా కానీ ఆలోచనలు మాత్రం అతని చుట్టూ తిరుగుతున్నాయి - వయసు మీద పడింది కదా ! జ్ఞాపక శక్తి తగ్గిందేమో!

''తాతీ!... తాతీ!...'' అంటూ నా ప్యాంటు పట్టి మా మనవడు లాగుతుంటే ఆలోచనలకు స్వస్తిచెప్పి వానివైప చూశాను.

వాడు వేలెత్తి ఎటో చూపుతున్నాడు.

ఏముందక్కడ??

అటు చూశాను... రోడ్డుమీద రంగు పెన్సిల్లతో వేసిన ఆంజనేయుని బొమ్మ అడుక్కునే వాడెవడో గీసినట్టున్నాడు.

వాని ముచ్చటనెందుకు కాదనాలని దగ్గరికి వెళ్లాము. బొమ్మ చాలా బావుంది. ఆ వేసినతను కుంటివాడిలాగున్నాడు. కళను ప్రదర్శించి పొట్టపోసుకుంటున్నట్టున్నాడు కాబోలు - పాపమనిపించింది.

చిల్లరకోసం జేబులో చేయిపెట్టి ఆ బిచ్చగాడివంక చూశాను.

అతని చింపిరి జుట్టూ, గడ్డం కలిసిపోయి ముఖంలో అవే ముఖ్యభాగాలైనాయి.

తెల్లని చింపిరి జుట్టూ, గడ్డం... ఆ గడ్డం వెనకాల నీరసించిన కళ్లు - ఆ కళ్లలోని జాలి చూపులూ... జాలి.... చూపులూ - షాక్ కొట్టినట్టు అదిరిపడ్డాను.

ఆ జాలి చూపుల కళ్లు - అతనివే... అతనే సందేహమే లేదు - అతను అతనే..

అప్రయత్నంగా నేను రెండడుగులు వెనక్కువేసాను. నా గుండే ఆగి, తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది.

అతను?... ఉద్యోగం? ఉద్యోగం అతనికి రాలేదా!!... నా మనసులో మళ్లీ కల్లోలం రేగింది. దడ ప్రారంభమైంది.

చిన్నగా ప్రారంభమైన తుపాను పెనుతుపానై ఉప్పెనలా నన్ను ముంచిది. నాలోరేగిన పెనుతుపాను ధాటికి నేను తట్టుకుని అక్కడ నిలువలేకపోయాను చేతికందిన వందనోటును ఆ బొమ్మపైకి జారవిడిచి వెనుకనుండి ఎవరో తరుముతున్నట్టుగా వడివడిగా ఇంటిదారి పట్టాను - మనవడితోసహా.

నా రక్తమంతా క్రమంగా ఘనీభవిస్తున్న ఫీలింగ్... న్యూనతా భావం నా శరీరాన్ని కబళించి కొంచెం కొంచెంగా నన్ను నిర్వీర్యుణ్ణి చేస్తుంది.

''ముమ్మాటికీ దోషివి నువ్వే! అతని ఆ జీవితానికి కారకునివి ముమ్మాటికీ నువ్వే!'' గాయాన్ని కెలుకుతున్న నా .అంతరాత్మకు ఏమని సమాధానం చెప్పను?!

. నాలో తీవ్ర మథనం-

నే చేసిన తప్పేమిటి? వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడం తప్పా!! కాదని బింకంగా అనుకున్నా మనసెందుకో ఎదురుతిరుగుతుంది.

నాకు చేతనైన సాయం చేశానని సంతృప్తి పడుదామన్న - 'అతని జీవితంలో పొందిన నష్టానికంతటికీ పరిహారమా! ఆ వందనోటు?' అని నా అంతరాత్మ నిలదీస్తుంది.

తీవ్ర సంఘర్షణ- రెండు మనసుల మధ్య.

తప్పు ఎవరిదైనప్పటికీ - ఈ సంఘర్షణ మాత్రం నన్ను వీడిపోదు తప్పు చేశానన్న భావం నన్ను వెంటాడీ వెంటాడీ పీడిస్తుంది.

వడివడిగా పడుతున్న నా అడుగులకంటే వేగంగా అపరాధ భావం నన్ను చుట్టుముట్టింది. నన్ను వివశున్ని చేస్తుంది.

తప్పు చేశానో లేదో నాకు తెలియదుకానీ, శిక్ష మాత్రం నాకు పెద్దగానే పడింది. అంతరాత్మ విధించిన ఈ శిక్ష అనుక్షణం నేను చచ్చేదాకా నన్ను చంపుతుంది ముమ్మాటికీ.

★★★★★

నేనిప్పుడు మంచంలో అవసానదశలో ఉన్నాను. జీవితం మొత్తంలో నేను ఆలోచించింది ఒక్కటే - 'నేను తప్పు చేశానా?' అని, అది నాకు అర్థంకాని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఒకవేళ తప్పు నాదే అయితే మాత్రం ఇక్కడి నుండే అతనిని దీనంగా వేడుకునే దొక్కటే 'మన్నించు సోదరా?' అని అంతకంటే నేనేం చేయగలను??